క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాల సందర్భంగా ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో ఈ నెల 12న శుక్రవారం ఉదయం 9గంటలకు మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏబీవీపీ విద్యార్థి సంఘం బాధ్యులు తెలిపారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో..

జహీరాబాద్ టౌన్: స్వామి వివేకానంద జయంతి యువజన వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని పద్మశాలి భవనంలో శుక్రవారం మహా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పద్మశాలి యువజన సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. రుధిర బ్లడ్ బ్యాంక్ హైదారాబాద్ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత అధికసంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

చెరువు భూమిని కాపాడండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి: చౌటకూరు మండలం వెండికోల్ గ్రామంలోని కాముని చెరువు భూమి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంతమంది కొన్నేళ్లుగా చెరువు భూమిని కబ్జా చేసి పంటలు సాగుచేస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు చెరువు భూమిని కాపాడాలని కోరారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

నారాయణఖేడ్: స్వాంతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే శివరావుషెట్కార్ స్మారక క్రికెట్ టోర్నీని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ రామచంద్రాపురం మండల శాఖ అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం వెలిమెల పాఠశాలలో ఎస్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, రామచంద్రాపురం మండల ఆర్థిక కార్యదర్శి పండరి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి, మహిళా నాయకులు సారా మమత, అనిత రెడ్డి, రామారావు, సరియా నాయక్, పుష్పలత, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజ వినియోగించొద్దు

రాయికోడ్(అందోల్): సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా గాలిపటాలను ఎగురవేసేందుకు నిషేధిత చైనా మాంజ వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. గాలిపటాలు ఎగరడం కోసం పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలతో పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి చైనా మాంజ తయారీ, రవాణ, వినియోగాలపై నిషేధించినట్లు తెలిపారు. తమ ఆదేశాలను ధిక్కరించి మాంజ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- నిత్య జీవితంలో గణితం అంతర్భాగం
- అందోలు ఎంఈఓ బండి కృష్ణ
- ఆకట్టుకున్న మాథ్స్‌ఫేర్



మ్యాథ్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి బండి కృష్ణ

జోగిపేట(అందోల్): సమకాలీన సమాజంలో అన్ని విభాగాలకు గణితం ముడిపడి ఉందని అందోల్ మండల విద్యాధికారి బండి కృష్ణ, రాష్ట్ర పీఆర్‌టీయూ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడు ఆకుల మాణయ్య అన్నారు. జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో గురువారం మ్యాథ్స్‌ఫేర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర నిపుణుడు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గణితంలో రాణించేవారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను మాథ్స్‌ఫేర్‌లో భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల మేధాసంపత్తి పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాల ఎండీ నాగేశ్వరరావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా పాఠశాలను నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు వివరించారు. మాథ్స్‌ఫేర్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, టీఆర్‌ఎస్‌ఎంఏ ముఖ్య సలహాదారుడు లింగాగౌడ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, రిషి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగిరెడ్డి, సెయింట్ అంథోని పాఠశాల అధ్యాపకుడు కిషన్, సీఆర్‌పీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వాతి, అరుణదేవి, రజిత, నరేందర్ పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న సేవలు మరువలేనివి

పటాన్‌చెరు: స్వేచ్ఛ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వడ్డే ఓబన్న సేవలు మరువలేనివని ఎస్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. వడ్డే ఓబన్న 217వ జయంతిని పురస్కరించుకొని గురువారం చిట్కుల్ గ్రామంలోని నీలం మధు తన కార్యాలయంలో ఓబన్న చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బాల్య మిత్రుడిగా, ముఖ్య అనుచరుడిగా, సేనాధిపతిగా చిన్న, సన్నకారు రైతులను వేధిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబావుట ఎగురవేసిన మహనీయుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్, ఈశ్వర్, రాజు, నగేష్, రాములాయుడు, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు, పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు నాయకులు

ఓటరు జాబితాపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కర్



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణంలో బీఎల్‌ఓ, సూపర్‌వేజర్లకు ఓటరు జాబితాపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈ నెల 22 వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, మాస్టర్‌ట్రైనర్ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించండి..

నారాయణఖేడ్: ఈ నెల 22వ తేదీ వరకు కొత్త ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు.

తప్పులు లేకుండా చూడాలి

కంది(సంగారెడ్డి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. కందిలో ఓటరు జాబితా నమోదుపై బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఈ నెల 22 చివరి తేదీ అని తెలిపారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

పటాన్‌చెరు: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చి వేయించారు. 'దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా' అనే వార్త ఈ నెల 11న సాక్షి పత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గురువారం జేసీబీతో ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో గోశాల ఎదురుగా నిర్మించిన అక్రమ నిర్మాణాలతో పాటు పద్మశాలి భవనం వెనక నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూడా తొలగిస్తామని తెలిపారు.



జేసీబీతో ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది

రేపు సర్వధర్మ సమ్మేళనం

నారాయణఖేడ్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే శివరావుషెట్కార్ 28వ వర్ధంతితో పాటు సర్వధర్మ సమ్మేళనాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడైన మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్‌షెట్కార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణఖేడ్ పట్టణ శివారులోని ఆయన సమాధి వద్ద మధ్యాహ్నం 12గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కర్ణాటకలోని బాల్కి హీరేమఠం సంస్థానాదీశులు బసవలింగపట్టదేవరు అధ్యక్షతన జరిగే ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సర్పంచ్‌ను అరెస్టు చేయాలి

హత్నూర(సంగారెడ్డి): విధి నిర్వహణలో భాగంగా వార్త సేకరణకు వెళ్లిన విలేకరులపై దాడి చేసిన సర్పంచ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర మాదిగ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హత్నూర మండల పరిధిలోని తుర్కల ఖానాపూర్ గ్రామ సర్పంచ్ చంద్రగౌడ్ విలేకరులపై దౌర్జన్యంగా దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. 20 ఏళ్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న మండల విలేకరులు తుర్కల ఖానాపూర్ గ్రామ శివారులో ఫోటోలు తీస్తుండగా సర్పంచ్ చంద్రగౌడ్ దురుసుగా ప్రవర్తిస్తూ బైక్, సెల్‌ఫోన్ దౌర్జన్యంగా తీసుకోవడమే కాకుండా ఒక దళిత విలేకరిని కులం పేరుతో దూషించారని మండిపడ్డారు. చంద్రగౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి సిద్ధి వినాయక ఆలయ ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధి వినాయకుడి ఆలయ 224వ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశంపై భార్య ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ రాఘవేంద్రకాలనీ చెందిన రామకృష్ణ ఈ నెల 7వ తేదీన భార్య హేమలతతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య ఎంత వెతికినా భర్త ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రామకృష్ణ

కళాశాలలు, పాఠశాలల్లో ముగ్గుల పోటీలు



నారాయణఖేడ్: రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నారాయణఖేడ్: సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రంగురంగులతో కూడిన అందమైన ముగ్గులు వేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపినవారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, గోవింద్, కాశీనాథ్, శివాజీ, సుకుమార్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అదేవిధంగా ఖేడ్‌పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

సీపీఐ అధ్వర్యంలో...

సదాశివపేట(సంగారెడ్డి): సంక్రాంతి సంబరాల్లో బాగంగా గురువారం సీపీఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపినవారికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రకాష్‌రావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జలలోద్దిన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాజోద్దిన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు షఫీహైమద్, సీపీఐ కార్యదర్శి వినోద, నాయకులు రుబీనాబేగం, ఆర్, లక్ష్మి, శంకరప్ప, రమేష్, ముస్తఫా, గోపాల్, బుజ్జమ్మ, అనసూజ, దివ్యవాణి, సంధ్య, నిర్మల, సాదిక్‌అలీ, వహీదా, రహీమా పాల్గొన్నారు.

శాంతినికేతన్‌లో పాఠశాలలో..

సదాశివపేట పట్టణంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలిపటేల్ ఆరవిందశ్రీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పతంగులను ఎగురవేశారు.

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని రాధాకృష్ణ మెమోరియల్ పాఠశాలలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పాండు, ప్రిన్సిపాల్ వెంకటేశం, ఉపాధ్యాయులు, సిబ్బంది శశికుమార్, దుర్గారామ్, అల్లావుద్దీన్, శ్రీలత, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

జహీరాబాద్ టౌన్: సంక్రాంతి పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలతో పాటు ప్రైవేట్ కళాశాలల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన ఈశ్వరి, శ్యామలకు ప్రథమ బహుమతి ద్వారా రూ.15 వేల నగదు అందజేశారు. వశిష్ఠ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సరిఖ, హరికలకు ద్వితీయ బహుమతి రాగా రూ.10 వేలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఐశ్వర్య, నిహారికలకు తృతీయ బహుమతి ద్వారా రూ.5వేల నగదును అందజేశారు. ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు పూజా, సాత్విక, యశోధ, కావేరి, ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు విజయశ్రీ, అరుణలకు రూ.1000 చొప్పున ప్రొత్సాహక బహుమతులను ట్రస్ట్ చైర్మన్ ఎల్లారెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ, అధ్యాపకులు శంకుతల, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో...

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు నస్రీన్, పద్మ లత, జవేరియ, జానకి, జయశ్రీ, సుమిత్ర, ఫాతిమా సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట: శాంతినికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



రాయికోడ్: సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రాధాకృష్ణ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు



పటాన్‌చెరు టౌన్: సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

◆ నాణ్యమైన భోజనం అందించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి దండు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని కోనాపూర్, నాగులపల్లి ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మమత, సీఆర్పీలు రాజేశ్వర్, మల్లేశం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇస్నాపూర్ సరిత వైన్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సురేందర్ సింగ్(బీహార్ వాసి) నాలుగేళ్ల క్రితం ఇస్నాపూర్‌కు వచ్చి వైన్స్‌లో పని చేసుకుంటూ, వైన్స్ వెనకాల ఓ గదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అనారోగ్యంగా ఉండటంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి గ్రామానికి చెందిన నవీన్(25) బుధవారం సాయంత్రం ముత్తంగి నుంచి కొండాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముత్తంగి పిస్తా హౌస్ సమీపంలోకి రాగానే వెనుకాల నుంచి వేగంగా వచ్చిన డీసీఎం నవీన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ రెండు చోట్లా ఓటుహక్కు కలిగి ఉండొద్దు

జోగిపేట(అందోల్): రెండు చోట్లా ఓటుహక్కు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని అందోలు-జోగిపేట ఆర్డీఓ పాండు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 20, 21 తేదీల్లో పోలింగ్ భూతులలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అందోల్ నియోజకవర్గంలో మొత్తం 2,50,866 మంది ఓటర్లు ఉండగా 1,27,347 మంది స్త్రీలు, 1,23,512 మంది పురుషులు, ఇతర ఓటర్లు ఆరుగురు ఉన్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మూడు నెలల్లో వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఈ నెల 12న జోగిపేటలో 2కే రన్ నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితాను విడుదల చేస్తామన్నారు.

◆ స్వామి వివేకానందకు ఘన నివాళి



సంగారెడ్డి అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో స్వామి వివేకానంద 161వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మెదక్ విభాగ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ బోడ లక్ష్మణ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్, తానాజీ, శశాంక్, దినేష్, అనుష, భానుప్రకాష్, నిఖిల్, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ వీఆర్‌ఏలను నియమించండి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామ పంచాయతీకి ఇద్దరు వీఆర్ఏలను నియమించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో వార్డుసభ్యులు, నాయకులు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో రెవెన్యూ, ఇరిగేషన్ తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వీటిని పరిష్కరించేవిధంగా అధికారులు వీఆర్ఏలను నియమించాలని కోరారు.

గురుకుల పాఠశాల సందర్శన..

జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలను సర్పంచ్ లావణ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి కలిసి భోజనం చేశారు. స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.